క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు



స్తంభానికి మరమ్మతులు చేసిన దృశ్యం

సంతబొమ్మాళి: ఆరికవలస గ్రామంలోని విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు ఆందోళన చెంది.. ప్రమాదం జరగకుండా పెద్దకర్రను సపోర్టుగా పెట్టారు. దీనిపై 'విద్యుత్ స్తంభానికి కర్ర సపోర్టు' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండల విద్యుత్‌శాఖ ఏఈ శశిభూషణరావు ఆధ్వర్యంలో సిబ్బంది స్తంభానికి రిజాయిండర్ వేసి ఎటువంటి ప్రమాదం లేకుండా పనులు చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఎరువుల కోసం రైతుల ఇక్కట్లు

పలాస: పలాస మండలంలో ఎరువుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సోమవారం ఉదయం కాశీబుగ్గలోని ఒక ప్రైవేటు ఎరువులు దుకాణానికి అధికారులు ఇచ్చిన చీటీలను పట్టుకొని రైతులు వచ్చారు. అయితే కొన్ని గంటల తరువాత ఎరువులు లేవని దుకాణ యజమని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇచ్చిన చీటీలను పట్టుకొని నిరసన తెలియజేశారు. రైతులు, రైతు సంఘాల నాయకులు తెప్పల అజయ్‌కుమార్, గొరకల బాలకృష్ణ, జుత్తు అశోక్ తదితరులు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు వద్ద వ్యవసాయ అధికారులు చీటీలు రాసి ఇస్తున్నారని, తీరా ఎరువులు దుకాణాలకు వెళ్తే అక్కడ ఎరువులు లేవని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

టెక్కలి రూరల్: స్థానిక గోపినాధపురం సమీపంలో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో అరటి గెలలతో వెళ్తున్న లారీ రహదారి మధ్యలో సోమవారం నిలిచిపోయింది. దీంతో చాలా సమయం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రావులపాలెం నుంచి అరటి గెలల లోడ్‌తో టెక్కలి వచ్చిన లారీ గోపినాధపురం వద్ద మలుపు తిప్పుతున్న సమయంలో యాక్షల్ రాడ్డు విరిగిపోవడంతో రోడ్డు మధ్యలో ఆగిపోయింది. దీంతో టెక్కలి నుంచి రావివలస, నౌపడ ఆర్ఎస్, సంతబొమ్మాళి, గల్లినౌపడ, పూండీ తదితర గ్రామాలకు వైపు వెళ్లే వాహనాలు, అలాగే అటువైపు నుంచి టెక్కలి వైపు వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులే వాహనాలను మళ్లించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పలాస: ఉపాధ్యాయ, ఉద్యోగుల పింఛన్ సమస్యలను పరిష్కరించాలని పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు కోరారు. ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏలు మంజూరు చేయాలని, పీఆర్‌ను ప్రకటించేంత వరకు ఐఆర్ ఇవ్వాలని, సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా గంగాహారతి


గంగాహారతి ఇస్తున్న దృశ్యం

కంచిలి: కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలిలో కొలువై ఉన్న మహాలక్ష్మమ్మతల్లి దేవాలయంలో గౌరీ పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి గంగాహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి పౌర్ణమి రోజున ఇక్కడ ఆలయం ఆవరణలోని కోనేరులో గంగాహారతి ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది.

విద్యుత్ మీటర్ నుంచి మంటలు

టెక్కలి రూరల్: పాతజాతీయ రహదారిలో భవానినగర్ సమీపంలో ఉన్న ఓ ఇంటిలోని విద్యుత్ మీటర్ నుంచి భారీగా మంటలు చేలరేగాయి. ఇంట్లో వారు భయంతో బయటకు పరుగులు తీశారు. ఇంటి మొత్తం పొగలు వ్యాపించాయి. గుర్తించిన స్థానికులు చేరుకొని మంటలను మంటలను అదుపు చేశారు.

అన్నదాత ఆందోళన!


తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిన బాహుదానది ఎడమ గట్టు (ఫైల్)

- తిత్లీ తుఫాన్‌కు బాహుదానది ఎడమగట్టు ధ్వంసం
- నేటికీ మరమతులకు నోచుకొని వైనం

ఇచ్ఛాపురం:

అన్నదాతకు సాగు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల తలరాతలు మాత్రం మారడంలేదు. 2018 అక్టోబర్ నెలలో సంభవించిన తిత్లీ తుఫాన్ కారణంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని బాహుదానది ఎడమ గట్టు చాలామేరకు కొట్టుకుపోయింది. దీంతో అప్పటికి చేతికి వచ్చిన పంట మొత్తం నీటమునిగి రైతులకు భారీస్థాయిలో నష్టాన్ని మిగిల్చింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పురపాలక సంఘంలోని బెల్లుపడ గ్రామం పరిధిలోని 1250 ఎకరాలకు చెందిన సుమారుగా 500 మంది రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. ఈ ఖరీఫ్ సమయంలో పొలాలకు నీరందించే సాగునీటి కాలువల నిర్వాహణ కూడా సక్రమంగా లేదు. ఇదే కాక ప్రభుత్వం నుంచి రైతులకుఅందవలసిన ఎరువులు, విత్తనాలు కూడా సక్రమంగా అందడం లేదు. దీంతో రైతులు అనేక ఒడిదొడుకుల మధ్య పంటను సాగు చేస్తున్నారు. అయితే సీజన్ పూర్తయ్యే నాటికి పంట చేతికి అందుతుందో.. లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఏటా ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే నాటికల్లా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురువడం, తుఫాన్‌లు సంభవిస్తుంటాయి. దీంతో మహేంద్రతనయ, బాహుదానదులకు వరద నీరు భారీస్థాయిలో చేరుతుంది. ఇవి పొంగిపొర్లి పంట పొలాలను ముంచెత్తుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో బాహుదానది ఎడమకాలువ గట్టు శిథిలం కావడంతో వరదనీరంతా బెల్లుపడ గ్రామ పరిసరాల్లోని పంట పొలాల్లో చేరిపోతుంది. ఈ కారణంగా రైతులు పండించిన పంట మొత్తం వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో భారీగా కురిసిన వర్షాలతో బాహుదా నది పొంగి పంట పొలాల్లోకి చేరింది. అయితే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పెద్దగా నష్టం వాటిల్ల లేదు. మరోసారి వరదవస్తే పంటలు పాడవ్వడం ఖాయమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా అక్టోబర్, నవంబర్ నెలల్లో సంభవిస్తున్న తుఫాన్లు, వరదల కారణంగా పంటలను నష్టపోతున్నామని.. బాహుదా నదికి పడిన గండిని పూడ్చాలని జిల్లా అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి బెల్లుపడ రైతులు చాలాసార్లు తీసుకెళ్లారు. అయితే కేవలం పరిశీలనకే పరిమితమవుతున్నారు తప్పితే శాశ్వత పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా గండిని పూడ్చి పంటలు నీటి మునగకుండా చూడాలని కోరుతున్నారు.


అభివృద్ధి పనుల్లేక పిచ్చిమెక్కలతో దర్శనమిస్తున్న బాహుదానది ఎడమ గట్టు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. బాహుదానది వరద గట్టుకి మరమ్మతులు చేయాలని చాలాసార్లు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు విన్నవించాం. అయినా సమస్యకు పరిష్కారం కనపడలేదు. వరదగట్టు సమస్యలను పరిష్కరిస్తే రైతులందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– బుద్దెపు వెంకటస్వామి, రైతు బెల్లుపడ గ్రామం

పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేదు



వరి పంట కోత పూర్తిచేసుకొని ఇంటికి తీసుకొచ్చేవరకు మాకు నమ్మకం కుదరదు. కోతలు కోసే సమయానికి వర్షాలు, వరదల కారణంగా చాలా వరకు పొలాలు నీట మునిగిపోతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి. దీంతో నమ్మకం ఉండడం లేదు.

–లోపింటి ధర్మరాజు, రైతు బెల్లుపడ గ్రామం

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

కంచిలి: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని మందస డీఆర్వో ఐ. రాము అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మఠంసరియాపల్లిలో వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతపై అటవీశాఖ సిబ్బంది స్థానికులకు సోమవారం అవగాహన కల్పించారు. అంతరించిపోతున్న వన్యప్రాణి జాతులను ఏవిధంగా సంరక్షించాలో తెలియజేశారు. జలంత్రకోట రిజర్వు ఫారెస్టు ఏరియాలో చాలా వరకు ఉన్న కింగ్ కోబ్రా జాతులు ఎలుకలు, కొన్ని రకాల పాములను ఆహారంగా తీసుకోవడం వలన రైతులకు, ప్రజలకు పాముల సమతుల్యత ఏర్పడి మెరుగైన పరోక్ష సేవలు అందిస్తున్నాయన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 గురించి వివరించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు భానుమూర్తి, వెంకటేష్, లక్ష్మణమూర్తి, దుర్గాదేవి, జోగారావు, సురేష్ ఉన్నారు.

అధికారులకు ఫిర్యాదు

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల మద్దతులో నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు చేపట్టారంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామి అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్, డీఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఇద్దరు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. బాధ్యులైన ఉపాధ్యాయులు, ఇతర నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్
- కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల బూత్ కన్వీనర్లతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి బూత్ కన్వీనర్లు ఎంతో కీలకమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన నాయకులు, బూత్ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్ల జాబితా విషయంలో ఎట్టి పరిస్థితిలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. బూత్‌ల వారీగా ఎప్పటికప్పుడు జాబితాలను సరిచూసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందికరమైన పరిస్థితులు కనిపిస్తే తక్షణమే తన దృష్టికి తీసుకువస్తే అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎక్కడైనా కార్యకర్తలపై అన్యాయమైన చర్యలు కనిపిస్తే తక్షణమే డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు కూట మి నాయకులు చేస్తున్న ప్రతీ అవినీతి కార్యకలాపాలపై నిలదీయడానికి కార్యకర్తలు ముందుకు రావాలని.. వారికి పార్టీ తరఫున అండగా ఉంటామన్నా రు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతీ నిరస న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పంద న రావడానికి కార్యకర్తలే కారణమని వెల్లడించారు. కింజరాపు కుటుంబం చేస్తున్న మైనింగ్ అక్రమాలపై నిలదీయడానికి క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తామన్నారు. అంతే కాకుండా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కారణంతో అన్యాయంగా క్రషర్లు మూసివేశారని.. అయితే దీనిపై అధికారులు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియామకమైన నూక సత్యరాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌ను సన్మానించారు.

పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నాయకులు రోణంకి మల్లయ్య, బి.వెంకటరమణ, ఎస్.వినోద్, ఎస్.జనార్దన్, శివారెడ్డి, బి.దివాకర్, టి.మాధవరావు, టి. గణపతిరావు, జి.సోమేష్, కె.గణపతిరావు, కామరాజు, సంతబొమ్మాళి మండలానికి చెందిన ఎస్.భీమారావు, జె.బాబూరావు, ఎ.మల్లేష్, డి.నీలకంఠం పాల్గొన్నారు.

ఆహార కమిషన్ చైర్మన్ సుడిగాలి పర్యటన


సోంపేట: చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డితో మాట్లాడుతున్న ఆదర్శ పాఠశాల మధ్యాహ్నభోజన పథకం వంటనిర్వాహకులు

కంచిలి: రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి పలు ప్రాంతాల్లో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. కంచిలి, సోంపేట, మందస, టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో పర్యటించిన ఆయన పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీలు, వసతి గృహాలను, మండల స్థాయి స్టాక్ పాయింట్లను సందర్శించారు. కంచిలిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను తొలుత సందర్శించి సరుకుల నిల్వలను, బియ్యం బస్తాను తూకం వేయడంతో ఐదు కిలోలు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ గోదాంలో సరకులను డిపోలకు సరఫరా చేసేటప్పుడు ప్యాకెట్ లెక్కన ఇస్తున్నారా లేక కిలోల చొప్పున లెక్కపెట్టి ఇస్తున్నారా అని గోదాం ఇన్‌చార్జిని ప్రశ్నించారు. అనంతరం కంచిలిలోని డాక్టర్ బీబీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజన పదార్థాల రుచులను చూశారు. పప్పు రుచి తక్కువగా ఉందని.. తాళింపు విషయంలో మరింత జాగ్రత్త వహించాలని వంట నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. కష్టపడి కాదు, ఇష్టపడి చదవాలని సూచించారు.

సమర్థవంతంగా పాఠశాలల నిర్వహణ

కంచిలిలో కమిషనర్ విలేకర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. చిన్న లోపాలను సరిదిద్దమని సిబ్బందికి సూచించామన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకుడు డి.మధుసూదనరావు, డీఈవో ఎ.రవిబాబు, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ ఇమల, పౌరసరఫరాల అధికారి గుంట సూర్యప్రకాశ్, ఆహార భద్రత అధికారి జి.శ్రీరాములు, స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఎస్ఐ పి.పారినాయుడు ఉన్నారు.

బిల్లులు అందడం లేదు సార్

సోంపేట: ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం బిల్లులు అందడం లేదని దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వంట నిర్వాహకులు ఆహార కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాస్థాయి అధికారులతో కలిసి బారువ మేజర్ పంచాయతీ వాడపాలెంలోని వెనుకబడిన తరగతుల వసతి గృహం, పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సోంపేట మేజర్ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాలు, చౌకధరల దుకాణాలు, ఆదర్శ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. వాడపాలెం వసతి గృహంలో వారానికి రెండు గుడ్లు అందజేస్తున్నారని విద్యార్థులు తెలియజేయడంతో ఇన్‌చార్జి వార్డెన్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు అందజేయమని వెనుకడబడిన తరగుతుల జిల్లా సంక్షేమఅధికారిని బి.అనురాధను ఆదేశించారు.

కేజీబీవీ సందర్శన

మందస: వీరగున్నమ్మపురంలోని కేజీబీవీని విజయ ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. మౌలిక సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ వాసంతి ఉన్నారు.

మెనూ పాటించాల్సిందే..

టెక్కలి: వసతి గృహాల్లో కచ్చితంగా మెనూ పాటించాల్సిందేనని విజయ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి టెక్కలి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల సమీకృత వసతి గృహం, కోటబొమ్మాళిలోని కేజీబీవీ, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం భోజనాలను రుచి చూశారు.

ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. సీఎస్ఈకి చెందిన విద్యార్థులు ఏడాదికి రూ. 4.25 లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ఈ హెచ్ఓడీ వై.రమేష్, ప్లేస్‌మెంట్ హెచ్ఓడీ సంతోష్‌కుమార్ అభినందించారు.

బాలికల ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు

టెక్కలి: బాలురతోపాటు బాలికలు కూడా ఎన్‌సీసీలో చేరి రాణించాలని ఆర్మీ హవల్దార్ రవికృష్ణ కోరారు. టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల విభాగం ఎన్‌సీసీ యూనిట్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో శిక్షణ పొందడం వలన విద్యా, ఉద్యోగ ప్రయత్నాల్లో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు డి.దాశరథి, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, రామిరెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఇచ్ఛాపురం రూరల్: చదువుకునే వయసులో పెళ్లి చేసుకోవడం జీవితాన్ని నాశనం చేసుకోవడమేనని, బాల్య వివాహాలను ప్రోత్సాహించడం చట్టరీత్యా నేరమని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ఈదుపురం ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలపై విద్యార్థులకు సోమవా రం అవగాహన కల్పించారు. ప్రస్తుతం బాలికలకు మాయమాటలు చెప్పి యువకులు లోబర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఇలాంటి సమయంలో సమయస్ఫూర్తితో మెలగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు బి.తమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ

మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ ప్రాంతాలలో జరిగిన క్విజ్, ప్రతిభ పరీక్షల్లో పాల్గొని విజయం సాధించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు కూన వేణుగోపాలరావు, సిబ్బంది సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. రంగోయి గ్రామంలో జరిగిన గ్రూప్ టాలెంటట్ టెస్టులో నాలుగో స్థానం, ఇసుకలపాలెంలో జరిగిన క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం చెప్పారు. విద్యార్థులు కీర్తన, జీవన్ సింగ్ ఠాగూర్, ఎస్.భార్గవి, కె.జ్ఞానేశ్వరి, శ్రీజ, సుస్మిత, గౌతమ్ ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది గణేశ్వరరావు, జి.భీమారావు, జానకమ్మ, లక్ష్మణరావు, అప్పారావు, పాపమ్మ, చిత్రసేను, రమేష్, హారిక ఉన్నారు.

జీఎస్టీ 2.0 పై అవగాహన

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థి దశ నుంచే జీఎస్టీ 2.0 పై అవగాహన కలిగి ఉండాలని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తలగాన హేమారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని పాఠశాలలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అనే అంశంపై వ్యాచరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, కె.రమణ, వై.కాళిదాసు, టి.యర్రన్న, సీహెచ్ ఉమామహేశ్వరరావు, సుజాత, ఎం.అప్పలస్వామి, ఆర్.ఇంద్రసేనరావు, జి.విశ్వనాథం, ఎన్.గొరనాయుడు ఉన్నారు.

కవిటి: జీఎస్‌టీ 2.0పై సమగ్రమైన అవగాహన అవసరమైన కవిటి కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలంనాయుడు అన్నారు. కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే కవిటి పట్టణంలోని వివిధ షాపింగ్ మాల్స్, సెలూన్‌షాప్‌లలో ఎంపీడీవో ఎల్.త్రినాథ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె శ్రీనివాసరెడ్డి అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

ఇచ్ఛాపురం: జీఎస్టీపై స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, ఎన్ఎస్ఎస్ పీవో రజనీకుమారి, అధ్యాపకులు సుధాకర్, యుగంధర్, బాపూజీ, పి.ప్రసాదరావు, జగదీష్, వై.జనార్ధనరావు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు ఈకేవైసీతో చెక్!

- మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో వివరాలు నమోదు
- ఈకేవైసీ చేయించుకోని వేతనదారులకు పని నిల్


ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు


వేతనదారులకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తున్న సిబ్బంది

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న వేతనదారులు తప్పని సరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తమ ఆధార్ కార్డును జాబ్ కార్డుతో అనుసంధానం చేసుకుంటేనే పని కల్పించాలని నిర్ణయించింది. ఈకేవైసీ నమోదు ప్రక్రియ కోసం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టింది. ఉపాధి వేతనదారుల ఆధా ర్, వివరాలు నమోదు చేసి ముఖగుర్తింపు ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీనికోసం వేతనదారులు తమ ఆధార్, జాబ్‌కార్డులతో స్వగ్రామంలోని ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిస్తే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. అయితే ఆధార్ కార్డును వేతనదారులు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకుని ఉండాలి. ఈకేవైసీ ప్రక్రియ చేయించుకోని వారికి ఇకపై పని కల్పించడం వీలుపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

టెక్కలి నియోజకవర్గంలో ఉపాధి వేతనదారుల వివరాలు	
మండలం	వేతనదారుల సంఖ్య
సంతబొమ్మాళి	35,694
టెక్కలి	16,555
కోటబొమ్మాళి	28,230
నందిగాం	19,961

పనుల్లో పారదర్శకత కోసమే..

ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత లేదనే ఆరోపణలు, నిధుల దుర్వినియోగం చేస్తున్నట్లు తరచూ సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. క్షేత్ర స్థాయిలో జరిగే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను వినియోగించా లని నిర్ణయించింది. కొత్తగా కేంద్రం తీసుకున్న ఈకేవైసీ విధానంతో పనుల్లో పారదర్శకత పెరుగుతుందని, ఒక జాబ్ కార్డుపై మరొకరు పనిచేసే అవకాశం ఉండదని అధికారులు పేర్కొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ఉపాధి హామీ పథకం వేతనదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. నమోదు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను త్వరిగతిన పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఆదేశాలించ్చాం. వేతనదారులు ఆధార్ వివరాలను వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసుకోవాలి. త్వరలో ఈకేవైసీ పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– పి.జయంతి ప్రసాద్, ఎంపీడీవో, సంతబొమ్మాళి

ఔదార్యం..



ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ధర్మరాజు ఔదర్యాన్ని చాటుకున్నారు. విద్యార్థులు కూర్చోవడానికి పరదాలు, మొక్కలను సోమవారం సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ మాట్లాడుతూ.. చదువు చెప్పే బడికి ఉపాధ్యాయులే దాతలుగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది చంద్రమణి, ధర్మరాజు, అనూరాధలు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

సమ్మేళనం..

సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. అప్పటి తరగతి గదిని తనివితీరా చూసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించి మెమెంటో అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గురుశిష్యుల బంధం ఎంతో గొప్పదన్నారు. పూర్వ విద్యార్థులు జీరు రాంబాబు, కె.నాగార్జున, ఎస్.కేశవరెడ్డి, కె.సంతోష్‌కుమార్, కె.సుజాత,ఎస్.బేబి, కె.జ్యోతి ఉన్నారు.–సంతబొమ్మాళి



సన్మానం..



అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా టెక్కలికి చెందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుడు బరాటం శ్రీనివాసరావును సన్మానించారు. ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.జనార్దనరావు, కె.చంద్రశేఖర్‌రావు, ఎం.రామ్మోహన్, ఎస్.సింహాచలం, ఎ.గణపతిరావు ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు.

–టెక్కలి